క్లుప్తంగా

శుభకార్యం



వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: మండల పరిధిలోని ఆర్ మరువపల్లికి చెందిన కొత్తకోట కాంతమ్మ కుమార్తె లత, నాగార్జున వివాహ వేడుకకు ఆదివారం ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, నారాయణ, న్యాయవాది అశ్వర్థ నారాయణ, కొండల రాయుడు, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గృహ ప్రవేశం



మాజీ ఉప ముఖ్యమంత్రి పరమేశ్వర్‌తో ఎమ్మెల్యే వెంకటరమణప్ప కుటుంబీకులు

పావగడ: పట్టణానికి సమీపంలో ఉన్న తన తోటలో నూతనంగా నిర్మించుకున్న గృహంలోకి ఎమ్మెల్యే వెంకటరమణప్ప ఆదివారం గృహ ప్రవేశం చేశారు. కర్ణాటక రాష్ట్రం నుంచే కాకుండా ఏపీ నుంచి కూడా అధిక సంఖ్యలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తరలివచ్చి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. త్వరలోనే జరగనున్న విధాన సభ ఎన్నికల దృష్ట్యా ఎమ్మెల్యే వెంకటరమణప్ప గృహ ప్రవేశం కంటే జన సమీకరణకే ఎక్కువ ప్రాధాన్యత కల్పించారని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది.

నూతన కమిటీ ఎన్నిక



ఎంపికైన రజక సంఘం కమిటీ సభ్యులు

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రజకాభివృద్ధి సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారిగా శ్రీరాములు వ్యవహరించారు. రజక సంఘం అధ్యక్షుడిగా రవి, గౌరవాధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా శంకరప్ప, నరేష్, నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా బాలాజీ, కార్యదర్శిగా ఈశ్వరప్ప, సహాయ కార్యదర్శిగా రామాంజనేయులు, కోశాధికారిగా రామాంజనప్పలను ఎన్నుకున్నారు.

రెడ్డి విద్యార్థినులకు హాస్టల్ భవనం



తుమకూరుకు తరలివెళ్తున్న రెడ్డి కులస్తులు

పావగడ: రెడ్డి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థినుల సౌకర్యార్థం తుమకూరులోని బెళగుంబలో హాస్టల్ భవనం నిర్మించనున్నట్లు తాలూకా రెడ్డి జన సంఘం అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి తెలిపారు. పట్టణంలోని గురుభవన్ మైదానం నుంచి పెద్ద సంఖ్యలో రెడ్డి కులస్తులు తుమకూరులో నిర్వహిస్తున్న హాస్టల్ భవనం భూమి పూజకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ స్థానిక నిరు పేద రెడ్డి విద్యార్థినులతో పాటు ప్రతిభావంతులైన ఇతర సామాజిక వర్గాల పేద విద్యార్థినులకు కూడా హాస్టల్‌లో ఉచితంగా 30 శాతం సీట్లు కేటాయిస్తామన్నారు.

సిద్దేశ్వరస్వామికి పూజలు

రొళ్ల: మండల పరిధిలోని టీడీ పల్లి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన సిద్దేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లసముద్రం, అగ్రహారం గ్రామానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వంటకాలు తయారు చేసి స్వామివారి ఎదుట నైవేద్యంగా సమర్పించారు.

యువకుడి ఆత్మహత్య

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌కు చెందిన అశోక్‌రాజు (30) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అశోక్‌రాజు గత కొద్ది సంవత్సరాలుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చూపించినా రోగం నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది గ్రామ సమీపంలోకి వెళ్లి పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు, బంధువులు అతడిని చికిత్స కోసం కదిరి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు.

సిరుల చెరకు !

- పెట్టుబడి తక్కువ .. ఆదాయం ఎక్కువ
- ఎకరాకు రూ.5.80 లక్షల ఆదాయం

చిలమత్తూరు: చెరకు సాగు రైతులకు సిరులు కురిపిస్తోంది. చిలమత్తూరు పంచాయతీ చేనేపల్లి, కోడూరు తదితర పంచాయతీల్లో పలువురు రైతులు 25 ఎకరాల్లో చెరకును పండిస్తున్నారు. ఎకరా చెరకు పంటకు రెండు లక్షల రూపాయలు ఖర్చు వస్తుండగా, ఖర్చు పోను దాదాపు మూడు లక్షల మేర ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

మార్కెట్ కన్నా తక్కువకే బెల్లం

చెరకు పండిన తర్వాత సొంతంగా పాత పద్ధతుల్లో బెల్లం తయారీ చేసి మంచి ధరలకు విక్రయిస్తున్నారు. బయట మార్కెట్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, ఉద్యోగులు స్థానికంగానే బెల్లం కొనుగోలు చేస్తున్నారు. కొందరు ఎలాంటి రసాయనాలు వేయకుండా ఉండే ఆర్గానిక్ బెల్లాన్ని దగ్గరుండి చేయించుకుంటున్నారు. బయట మార్కెట్ కన్నా తక్కువ ధరలకు ఇస్తుండటంతో ఇటు రైతుకు, అటు కొనుగోలుదారులకు మేలు కలుగుతోంది. గ్రామీణ ప్రజలు సైతం ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ చక్కెర కన్నా బెల్లం వినియోగంపైనే ఆసక్తి కనబరుస్తుండటం విశేషం.



చేనేపల్లిలో సాగులో ఉన్న చెరకు పంట

ఆదాయం బాగుంది

చేనేపల్లి వద్ద మాకున్న 17 ఎకరాల్లో 14 ఎకరాలు చెరకును సాగు చేశాను. వర్షాలు సమృద్ధిగా కురవడంతో దిగుబడి బాగా వచ్చింది. సొంతంగా బెల్లాన్ని తయారు చేసి విక్రయిస్తున్నాము. పెట్టుబడి రూ.2 లక్షలు పోను రూ.3 లక్షలు ఆదాయం వస్తోంది. కష్టం ఉన్నా దిగుబడి బాగా వచ్చిందంటే ఆ సంతోషం వేరు.

\- చౌడప్ప, రైతు చేనేపల్లి





పాకాన్ని అచ్చులోకి పోస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో పాల పొంగులు



సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రంలో కుండకు పూజలు చేస్తున్న మహిళలు

బత్తలపల్లి: మాఘ మాసం దీక్షలు చేపట్టిన పలువురు మహిళలు నాలుగో ఆదివారం ఆలయాల వద్ద భక్తిశ్రద్ధలతో పాల పొంగులు నిర్వహించారు. తెల్లవారుజామునే దేవాలయాలకు వెళ్లి ప్రదక్షిణలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం సమీపంలోని దేవాలయాల వద్దకు వెళ్లి అక్కడ పూజలు నిర్వహించారు. అక్కడ కొత్త కుండలో నైవేద్యం చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రంలోనూ, మాల్యవంతం, రామాపురం, కోడేకండ్లలోని వీరనారాయణస్వామి, డి.చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం ఆలయాల్లోనూ పాల పొంగులు నిర్వహించారు.

ఎందుకిలా?



పెనుకొండ పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ విగ్రహానికి ముసుగు వేయని దృశ్యం



సోమందేపల్లిలో దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం

పెనుకొండ: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో నిబంధనల మేరకు పలు ప్రాంతాల్లో ఓటర్లను ప్రభావితం చేసేలా ఉన్న వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు, విగ్రహాలు తదితర వాటిని అధికారులు తొలగిస్తున్నారు. అయితే నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు వేసిన అధికారులు... పెనుకొండ పట్టణంలో ఉన్న ఎన్‌టీ రామారావు విగ్రహానికి ముసుగు వేయకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికైనా ఎన్నికల కోడ్‌ను అధికారులు పక్కాగా అమలు చేయాలని పలు పార్టీల నాయకులు కోరుతున్నారు.

గ్రామీణ క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, శంకరనారాయణ

మడకశిరరూరల్: గ్రామీణ క్రీడల అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని మడకశిర, పెనుకొండ ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని సీ కొడిగేపల్లి గ్రామంలో కాపు సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ టీ-10 శ్రీసత్యసాయి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం మధ్యాహ్నం ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, శంకరనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. సీ కొడిగేపల్లి సర్పంచ్ కవిత అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ గ్రామీణ క్రీడల పట్ల యువతను మరింతగా ప్రోత్సహించడానికి గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్న కాపు సురేష్‌రెడ్డిని అభినందిస్తున్నామని తన వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఇలాంటి క్రీడ పోటీలను మరింతగా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంత గానో దోహదపడుతాయని చెప్పారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకొని గ్రామీణ, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ గ్రామీణ క్రీడల పట్ల యువతను మరింతగా ప్రోత్సహించడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మారు మూరు గ్రామంలో వారం రోజులకుపైగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను సొంత ఖర్చుతో నిర్వహిస్తున్న కాపు సురేష్ రెడ్డిని అభినందించారు. గెలుపొందిన జట్టుకు రూ.లక్ష , రన్నరప్‌కు రూ.50 వేలు బహుమతులు అందిస్తుండటం హర్షణీయమన్నారు. ఈ టోర్నీలో మొత్తం 22 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు సురేష్‌రెడ్డి తెలిపారు. సర్పంచ్ కవిత మాట్లాడుతూ ఇలాంటి టోర్నమెంట్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. దాత సురేష్‌రెడ్డితో పాటు టోర్నీ నిర్వాహకుల బృందం ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించింది. మొదటి రోజు జరిగిన మ్యాచ్‌లో పరిగి జట్టుపై మడకశిర మండలం చందకచెర్లు జట్టు గెలుపొందింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సరోజమ్మ, సింగల్ విండో అధ్యక్షుడు రామిరెడ్డి, మాజీ ఎంపీపీ బజ్జప్ప, జగనన్న సచివాలయ కన్వీనర్ నాగేంద్ర యాదవ్, సర్పంచులు రామచంద్రారెడ్డి, మంజునాథ్‌రెడ్డి, కరియన్న, నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, హనుమంతరెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సత్యనారాయణ, జమ్మానిపల్లి మూర్తి, నటరాజు తదితరులు పాల్గొన్నారు.



బౌలింగ్ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి రక్షా అకాడమీ ప్రధాన గేటు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాలమేరకు... చిలమత్తూరుకు చెందిన రవికుమార్ అనే వ్యక్తి ఆదివారం రాత్రి బాగేపల్లి నుంచి చిలమత్తూరుకు ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. అయితే రక్షా అకాడమీ సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పడంతో కింద పడిపోయాడు. రవికుమార్ తలకు గాయం కావడంతో క్షతగాత్రుడికి రక్షా అకాడమీ వైద్యుడు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం అతన్ని బాగేపల్లి ఆస్పత్రికి తరలించారు.

యువకుడికి తీవ్ర గాయాలు

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనం బోల్తా పడటంతో ఓ యువకుడు గాయపడిన సంఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై కియా పరిశ్రమ ఎదురుగా ఆదివారం చోటు చేసుకొంది. స్థానికుల వివరాలమేరకు... ఇస్లాపురం గ్రామానికి చెందిన వడ్డి సురేష్ ద్విచక్ర వాహనంపై గుట్టూరు నుంచి పెనుకొండ వైపునకు వెళ్తున్నాడు. అయితే కియా పరిశ్రమ సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనాన్ని అదుపు చేసుకోలేక ముందు వెళ్తున్న లారీని ఢీ కొన్నాడు. తీవ్రంగా గాయపడిన సురేష్‌ను పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



తీవ్రంగా గాయపడిన సురేష్



తీవ్రంగా గాయపడిన రవికుమార్

రోడ్డు ప్రమాదంలో రైతుకు గాయాలు

కనగానపల్లి: పాతపాళ్యం సమీపంలో తగరకుంట రహదారిలో ఆదివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పొలం వద్దకు వెళ్తున్న రైతు సుధీర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు.. రైతు సుధీర్‌రెడ్డి ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పాతపాళ్యం- తగరకుంట రహదారిలో క్రాసింగ్ వద్ద వేగంగా వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. దీనిపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



శివలింగాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

అమరాపురం: స్థానిక ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో ఆధ్వర్యంలో ఆదివారం శివరాత్రి ఉత్సవాలను నిర్వాహకురాలు పుష్పక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనంలో శివలింగాన్ని ఏర్పాటు చేసి ఉదుగూరు, కాచికుంట గ్రామాల్లో ఊరేగించారు. ఈనెల 18న నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.



సుగూరు ఆలయం వద్ద కంప చెట్లు తొలగిస్తున్న దృశ్యం

సుగూరులో శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు

హిందూపురం: శివరాత్రి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని సుగూరు ఆంజనేయస్వామి ఆలయ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పర్యవేక్షణలో సిబ్బంది ఆలయ ఆవణాన్ని శుభ్రపరిచే చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ఆదేశాలతో ఆలయ పరిసరాల్లో ఏపుగా పెరిగిన కంపచెట్లు, ముళ్లపొదలను యంత్రాలతో చదును చేశారు. గుంతలు పూడ్చి వేయించారు. అలాగే శివరాత్రి రోజు జాగరణ సమయంలో భజనలు, ప్రసాదాల పంపిణీ సదుపాయం కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆశాజనకంగా పప్పుశనగ



పెద్దగువ్వలపల్లిలో పప్పుశనగను యంత్రం ద్వారా కోస్తున్న రైతు



పంట కోసి ఆరబెట్టిన దృశ్యం

- పంట కోతలో అన్నదాతలు

రొద్దం: ఈ ఏడాది పప్పుశనగ పంట దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రొద్దం మండల వ్యాప్తంగా 3 వేల ఎకరాల్లో పప్పుశనగ సాగు చేసినట్లు ఏఓ నివేదిత పేర్కొన్నారు. ఎకరాకు 5 నుంచి 7 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దిగబడి బాగుందని చెబుతున్నారు. పంట కోతకు రావడంతో పంట కోతలో రైతులు బిజీ బిజీగా ఉన్నారు. కూలీల కొరత ఉండడంతో యంత్రాల ద్వారా పంటను కోస్తున్నారు.

ఆనందంగా ఉంది

గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది పప్పుశనగ దిగుబడి ఆశాజనకంగా ఉంది. వర్షాలు సకాలంలో కురవడంతో మంచి దిగుబడి వచ్చింది. ఇప్పటికే పప్పుశనగ కోతలు ప్రారంభించాను. ఎకరాకు 6 క్వింటళ్ల వరకు దిగుబడి వస్తోంది. పంట పెట్టుబడి ఎకరాకు రూ.15 వేలు అయింది. ఈ లెక్కన ఎకరాకు రూ. 10 నుంచి రూ.15 వేల వరకు ఆదాయం వస్తుంది.

\- భాస్కర్‌రెడ్డి, పెద్దగువ్వలపల్లి, రొద్దం



ఘనంగా విగ్రహ ప్రతిష్ట



అక్కమ్మగార్ల విగ్రహం

రొద్దం: మండల పరిధిలోని కోగిర గ్రామ సమీపాన ఏడుగురు అక్కమ్మగార్ల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి గంగపూజ, గణపతి పూజ, రక్షాబంధన వాస్తు పూజ, రక్షాగ్ని, హోమాలు చేశారు. సోమవారం తెల్లవారు జామున 5 గంటలకు నూతన విగ్రహాలు ప్రతిష్టాపన కార్యక్రమం చేస్తున్నట్లు అర్చకుడు అమరేంద్ర చెప్పారు. అనంతరం పుణ్యాదానం, హోమాలు, నవగ్రహాల పూజ, తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

26న శోభాయాత్ర



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ఛత్రపతి శివాజీ మహరాజ్ శోభాయాత్ర , శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమాన్ని ఈనెల 26న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు శివాజీ సేవ ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్వామి పరిపూర్ణానందస్వామి హాజరవుతారని తెలిపారు. ఆదివారం పట్టణంలోని రాజాధాని ఫంక్షన్ హాల్‌లో శివాజీ సేవ ట్రస్ట్ సభ్యులు సమావేశమయ్యారు. శోభాయాత్రకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. శోభాయాత్ర సూగురు వద్ద ప్రారంభమై మేళాపురం వద్ద ఉన్న తెలుగు తల్లి విగ్రహం వరకు సాగుతుందన్నారు.

భక్తిశ్రద్ధలతో దోనె సేవ



ప్రత్యేక అలంకరణలో మైలారలింగేశ్వరస్వామి

అమరాపురం: మండల పరిధిలోని తమ్మేడేపల్లి గ్రామంలో కురుబ ,దళిత కులస్తుల ఆరాధ్యదైవం మైలారలింగేశ్వరస్వామికి దోనె సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచే స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో వెండి గిన్నెల్లో ఏర్పాటు చేసిన పండ్లు, పాలు, చక్కెర తదితర వాటికి దోనె సేవ పూజ నిర్వహించారు. గొరవయ్యలు నృత్యం చేస్తూ ప్రసాదాన్ని భుజించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను ఊరేగించారు. తర్వాత భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.



అరటి పండ్లు తింటున్న గొరవయ్యలు



దోనె పూజ నిర్వహిస్తున్న భక్తులు